


జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## ఖమ్మం
ఆదివారం | 30 | ఆగస్టు | 2026 ◆ పేజీలు : 3


## పార్టీ అభివృద్ధి కి ప్రతి ఒక్క కార్యకర్త కృషి చేయాలి

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్



**కారేపల్లి, ఆగస్టు 29, ప్రజా జ్యోతి:** కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం ప్రతి ఒక్క కార్యకర్త ,నాయకులు కష్టపడి కలిసి పని చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోతు రామదాసు నాయక్ అన్నారు. శనివారం వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సింగరేణి మండల నాయకులతో మాట్లాడుతూ ప్రతి కార్యకర్త, నాయకులు కలిసికట్టుగా తారతమ్యాలు లేకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని, ఏదైనా పార్టీ పరమైన, అభివృద్ధి పరమైన సమస్యలు వస్తే నా దృష్టి తీసుకురండి మనమందరం సమన్యముతో పరిష్కారం చేసుకుందాము. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నారు వారి సహాయ సహకారంతో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందు ఉంచే ప్రయత్నం చేద్దాం అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బానోతు రామ్మూర్తి నాయక్, కారేపల్లి సొసైటీ చైర్మన్ దుగ్గినేని శ్రీనివాసరావు, ఇమ్మడి తిరుపతిరావు,గూగులోతు రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## టేకు చెట్ల నరికివేత పై ఫారెస్ట్ టాస్క్ఫోర్స్ సిబ్బంది పరిశీలన



**కారేపల్లి, ఆగస్టు 29, ప్రజా జ్యోతి:** సింగరేణి మండల కేంద్రంలో గల ఇంటి స్థల పట్టా భూమిలో నరికివేసిన టేకు చెట్లపై ఖమ్మం జిల్లా అటవీశాఖ టాస్క్ ఫోర్స్ డీఆర్ఓ ఏ.నాగమణి శనివారం విచారణ చేపట్టారు. సింగరేణి మండల కేంద్రమైన కారేపల్లి కి చెందిన మన్నే పల్లి జయ తన భూమిలో గల 30 టేకు చెట్లను గుట్టుచప్పుడు కాకుండా కారేపల్లికి చెందిన ఓ కలప వ్యాపారి నరికి వేశాడని జిల్లా ఫారెస్ట్ అధికారికి ఫిర్యాదు చేసింది. అందులో భాగంగా డీఎఫ్ఓ ఆదేశాలతో టాస్క్ ఫోర్స్ డీఆర్ఓ నాగమణి, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ బి.ఏడుకొండలు, బీట్ ఆఫీసర్ ఆర్.ప్రసాద్, స్థానిక బీట్ ఆఫీసర్ బి.రవి, శ్రీకాంత్ చెట్లు నరికిన ప్రదేశాన్ని పరిశీలించారు. దర్యాప్తు చేసిన పూర్తి విచారణ నివేదికను డీఎఫ్ఓకు అందజేయనున్నట్లు డీఆర్ఓ తెలిపారు.

# పర్యవేక్షణతో అభివృద్ధి పనులు నాణ్యతతో పూర్తి చేయాలి

- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వర రావు
- నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజా ప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలి
- రూ. 95.50 లక్షల సుడా నిధులతో రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** నగరంలో చేపట్టిన అభివృద్ధి పనులను పర్యవేక్షణతో నాణ్యతతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు.ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని 42వ డివిజన్‌లో రూ. 95.50 లక్షల సుడా నిధులతో చేపట్టనున్న రోడ్లు, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు మంత్రి వర్యులు శనివారం శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగ పడే ప్రతి అభివృద్ధి పనిని నాణ్యతతో చేపట్టి, పదికాలాల పాటు మన్నికగా ఉండే విధంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనుల అమలులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించాలని స్పష్టం చేశారు.అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో పాటు స్థానిక ప్రజలు కూడా నిరంతరం పర్యవేక్షించాలని, ప్రజల భాగస్వామ్యంతో చేపట్టే పనులు మరింత నాణ్యతగా పూర్తవుతాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలను ప్రభుత్వం కల్పిస్తోందని అన్నారు.నగరంలో విశాలమైన రహదారులు, మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం ద్వారా అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని మంత్రి పేర్కొన్నారు .పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్న మంత్రి, పరిశుభ్రత వల్ల ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా కుటుంబాలపై వైద్య ఖర్చుల భారం తగ్గుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మహ్మద్ ఖాదర్ బాబా, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, మునిసిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

- జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య



**పాలేరు ఆర్.సీ ఆగస్టు29 ప్రజా జ్యోతి** డిజిటల్ క్రాప్ సర్వేలో పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి రైతు పంట వివరాలను తప్పులేకుండా నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. శనివారం కూసుమంచి మండల పరిధిలోని గురవాయిగూడెం గ్రామంలో డిజిటల్ క్రాప్ సర్వే వాలంటీర్ వెంకటేష్ నిర్వహిస్తున్న డిజిటల్ క్రాప్ సర్వేను ఆయన పరిశీలించి, తగు సూచనలు చేశారు. రైతులు పండించిన పత్తి, వరి, పెసర తదితర పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు. పంట ఉత్పత్తులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించే సమయంలో రైతుల వివరాలు, పంట వివరాలు సరిగా నమోదు కాకపోతే నష్టపోయే అవకాశం ఉందని ఆయన తెలిపారు. అందువల్ల పంటల నమోదు సమయంలో ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తగా ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయాలని వాలంటీర్లను ఆదేశించారు. రైతులు తమ గ్రామాల్లో పంటల వివరాలను నమోదు చేస్తున్న వాలంటీర్లను సంప్రదించి, తమ పంట వివరాలు తప్పులేకుండా

మిగతా 3 లో...

## లారీని ఢీకొట్టిన కారు

- గ్రీన్ ఫిల్డ్ హైవే పై వరస రోడ్డు ప్రమాదాలు



**వేంసూరు ఆగస్టు 29 ప్రజాజ్యోతి** మండల పరిధిలోని అడసర్లపాడు సమీపంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేపై శనివారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. లారీని వెనుక నుంచి కారు ఢీకొట్టడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయింది. ప్రమాద సమయంలో ఎయిర్‌బ్యాగ్స్ తెరుచుకోవడంతో పెనుప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న ఒకరికి గాయాలయ్యాయి.గ్రీన్‌ఫీల్డ్ హైవేపై తరచూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.ఇటీవల కాలంలో వరుసగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు కారణాలను గుర్తించి తగిన చర్యలు తీసుకోవడంపై దృష్టి సారించాలని వాహనదారులు కోరుతున్నారు.హైవేపై ప్రమాదాలు ఎందుకు జరుగుతున్నాయనే విషయాన్ని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, ప్రమాదాలకు కారణమవుతున్న అంశాలను గుర్తించాలని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నివారణకు అవసరమైన భద్రతా చర్యలు, హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రణ చర్యలు చేపట్టి ప్రయాణికుల భద్రతకు భరోసా కల్పించాలని వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జర్నలిస్టుల పాదయాత్ర న్యాయమైనదే

- జర్నలిస్టుల పాదయాత్రలో మాట్లాడిన బిఆర్ఎస్ నాయకులు, బోనకల్ మాజీ జెడ్పీటిసి బానోత్ కొండ
- జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు వెంటనే కేటాయించాలి
- సంఘీభావం తెలిపిన వివిధ పార్టీల నాయకులు డిమాండ్







**బోనకల్, ఆగస్టు 29(ప్రజా జ్యోతి):** ఇళ్ల స్థలాల కోసం జర్నలిస్టులు చేస్తున్న పాదయాత్ర న్యాయమైన డిమాండ్లే అని బిఆర్ఎస్ నాయకులు, బోనకల్ మాజీ జెడ్పీటిసి బానోత్ కొండ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో నాలుగో స్తంభంగా పనిచేస్తున్న జర్నలిస్టులు డిమాండ్లకు బిఆర్ఎస్ పార్టీ తరపున, బోనకల్ గ్రామపంచాయతీ తరపున ఎల్లవేళలా మా అండదండలు ఉంటాయని, అదేవిధంగా బోనకల్ మండలంలో పనిచేస్తున్న జర్నలిస్టులు ఇళ్ల స్థలాల విషయంలో బోనకల్ గ్రామపంచాయతీ తరపున సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తామని అన్నారు. టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జర్నలిస్టుల పాదయాత్ర శనివారం బోనకల్ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ పాదయాత్రకు అపూర్వ స్పందన లభించింది. ఈ పాదయాత్రకు బీఆర్ఎస్, బిజెపి, సిపిఎం , తెలుగుదేశం, ఎమ్మార్పీఎస్ పార్టీలతో పాటు సిఐటియు, భవన నిర్మాణ కార్మిక నాయకులు, మండల ఆర్యవైశ్య సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కూడా పాదయాత్ర చేస్తున్న జర్నలిస్టులకు పూలమాలలు వేసి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సంఘీభావం తెలిపిన నాయకులు మాట్లాడుతూ... జర్నలిస్టుల సమస్యలు వెంటనే పరిష్కరించి అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన డిమాండ్లకు మా అఖిలపక్ష పార్టీలు బిఆర్ఎస్, బిజెపి, సిపిఎం, ఎమ్మార్పీఎస్, తెలుగుదేశం తో పాటు సిఐటియు, భవన నిర్మాణం, ఆర్యవైశ్య సంఘం తరపున అండగా ఉంటామని తెలియజేశారు. అనంతరం రావినూతల నుండి బోనకల్ ఫ్లై ఓవర్ మీదుగా పాదయాత్ర చేసుకుంటూ బోనకల్ గ్రామపంచాయతీ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ తరువాత తాహసిల్దార్ కార్యాలయానికి వెళ్లి తాహసిల్దార్ చల్లూరి సుధాకర్ కు వినతి పత్రాన్ని అందజేసి వారి సమస్యలను తాహసిల్దార్ కు వివరించారు. సంఘీభావం తెలిపిన వారిలో చింతలచెరువు కోటేశ్వరరావు, కిలారి సురేష్, తెల్లాకుల శ్రీనివాసరావు, మహిళా నాయకురాలు తెల్లాకుల రజని, గుగులోతు నరేష్, రావుట్ల సత్యనారాయణ, బరకయ్య, పారా ప్రసాద్, కొమ్మినేని ఉపేందర్, వెంగళ కనకయ్య, జంపాల రవి, తాళ్లూరి సురేష్, గుగులోతు నాగేశ్వరరావు, చిట్టోజు శ్రీనివాసరావు (ఫోటో ప్రసాద్), షేక్ బాజీ, తాటికొండ వెంకటరత్నం, కోట హనుమంతరావు, వివిధ పార్టీల నాయకులు ఉన్నారు.

# జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు పాదయాత్ర



**ఎర్రుపాలెం ప్రజా జ్యోతి** రాష్ట్రంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన ఖమ్మం జిల్లా స్థాయి పాదయాత్ర శనివారం ఎర్రుపాలెం మండలంలో కొనసాగింది. మండల కేంద్రంలోని రింగ్ సెంటర్ నుంచి స్థానిక జర్నలిస్ట్ లతో కలిసి ర్యాలీగా బయలుదేరి గాంధీ బొమ్మ సెంటర్ లో మహాత్మాగాంధీ విగ్రహానికి, రైల్వే స్టేషన్ సెంటర్ లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ కె. సునీత ఎలిజిబెత్ కు వినతిపత్రం అందజేశారు. జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వానికి తమ వినతిని తెలియజేయాలని కోరారు. జర్నలిస్టుల న్యాయమైన కోర్కెను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, అర్హులైన ప్రతి జర్నలిస్టుకు ఇళ్ల స్థలాలు కల్పించాలని అఖిలపక్ష నాయకులు కోరారు.

**అఖిలపక్షాల సంఘీభావం ....**

పాదయాత్రకు మండలంలోని వివిధ రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, గ్రామపంచాయతీ సర్పంచ్ నంద్రు అశ్విని, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు శీలం కవిత, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొగ్గుల శ్రీనివాస రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు గూడూరు వెంకటేశ్వరరెడ్డి, దోమందుల సామేలు, బీజేపీ మండల అధ్యక్షుడు అనుమోలు సురేష్, నూతక్కి నరసింహారావు, సీపీఎం నాయకులు గామాసు జోగయ్య, నాగులవంచ వెంకటరామయ్య, యూటీఎఫ్ నాయకులు అనుమోలు కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, నంద్రు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొని తమ మద్దతు తెలిపారు.ఈ సందర్భంగా పాదయాత్ర నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పని చేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చే జర్నలిస్టుల సొంతింటి కలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యను ప్రభుత్వం ప్రత్యేకంగా పరిగణనలోకి తీసుకుని త్వరితగతిన పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

**పాల్గొన్న నాయకులు ....**

టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, కోశాధికారి తేనే వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు దువ్వా సాగర్, సహాయ కార్యదర్శి కొత్త యాకేష్, టిబీజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ సభ్యురాలు నలబోల మధుశ్రీ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు టి.ఎస్. చక్రవర్తి, రాష్ట్ర నాయకులు మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, దగ్గుపాటి మాధవరావు, జానీ పాషా, కొరకొప్పుల రాంబాబు, గుడిమెట్ల మోహన్ రావు, టిబీజేఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్యా గణేష్, కోశాధికారి యూసఫ్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యుడు అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, తిరుపతిరావు, ఎండి షకీల్ మహ్మద్, స్రామాట్ గుప్తా, కెదాసి కిరణ్ కుమార్, మండల పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.

## మధిర జమియా మసీదు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

- : తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం
- డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత

**మధిర ప్రజా జ్యోతి** మధిర పట్టణంలోని చారిత్రాత్మక జమియా మసీదు (మర్కజ్ ) ఆవరణలో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నూతన షాదీఖానా నిర్మించాలని తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నాయకులు కోరారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఐక్య సంఘం అధ్యక్షుడు మౌలానా షేక్ ముజాహిద్ ఇషాతి నేతృత్వంలో ప్రతినిధుల బృందం మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాతను కలిసి వినతిపత్రం సమర్పించింది.ఈ సందర్భంగా మౌలానా షేక్ ముజాహిద్ ఇషాతి మాట్లాడుతూ,వందేళ్ల చరిత్ర కలిగిన జమియా మసీదుకు మధిర పట్టణంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు,మండలాల నుంచి రోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారని తెలిపారు.అయితే మసీదులో నమాజుకు ముందు వజూ చేసుకోవడానికి,అలాగే మరుగుదొడ్ల వసతి సరిగా లేకపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చైర్‌పర్సన్ దృష్టికి తీసుకెళ్లారు.అలాగే పట్టణంలో ముస్లిం జనాభా పెరిగినందున, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ షాదీఖానా ఎంతమాత్రం సరిపోవడం లేదన్నారు.ఫలితంగా వివాహాలు,శుభకార్యాల కోసం పేద,మధ్యతరగతి కుటుంబాలు వేలాది రూపాయలు వెచ్చించి ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.మసీదు ప్రాంగణంలో మరుగుదొడ్లు, వజూ సౌకర్యం అందుబాటులోకి తెచ్చి,ఆధునిక వసతులతో కొత్త షాదీఖానా నిర్మిస్తే పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని విజ్ఞప్తి చేశారు.ఈ వినతిపై మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత సానుకూలంగా స్పందించారు.ఈ సమస్య తీవ్రతను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.వారి సహకారంతో త్వరితగతిన నూతన షాదీ ఖానా నిర్మాణం,మసీదులో వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ముస్లిం ఐక్య సంఘం నాయకులు సయ్యద్ రసీదు,ఎస్.కె.బాజీ, గౌస్ ఉద్దీన్, మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టు నేత అనిల్ రెడ్డిని పరామర్శించిన టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర నాయకులు

- దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు



**ఖమ్మం ప్రతినిధి ప్రజా జ్యోతి** భార్య మృతి పట్ల తీవ్ర విషాదంలో ఉన్న తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర కార్యదర్శి, భద్రాచలం టీవీ9 రిపోర్టర్ కర్ర అనిల్ రెడ్డిని ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్యతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా నాయకులు పరామర్శించారు.భద్రాచలంలోని అనిల్ రెడ్డి నివాసానికి శనివారం వెళ్లిన నాయకులు ఆయనను ఓదార్చి, దివంగత సరళా రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సరళా రెడ్డి మృతి పట్ల మామిడి సోమయ్య తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ, అనిల్ రెడ్డికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ పరామర్శ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు చిర్రా శ్రీనివాస్ గౌడ్, ఎలుగోటి వెంకట్రావు, కరీంనగర్ జిల్లా కార్యదర్శి కుడితాడు బాపురావు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ వి. రవికుమార్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నానబాల రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి అర్వపల్లి నగేష్, కోశాధికారి వేములకొండ రమేష్, ఉపాధ్యక్షుడు కందబోయిన నాగకృష్ణ, జి. గోపాలకృష్ణ, మహబూబ్‌నగర్ జిల్లా కార్యదర్శి ఎం. గోపాల్,పెద్దపల్లి జిల్లా కార్యదర్శి సుంక మహేష్, మణుగూరు నాయకులు పొదిల సుబ్బారావు, భద్రాచలం నాయకులు సంపత్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు సరళా రెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేసి, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. అనిల్ రెడ్డి కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ఈ విషాద సమయంలో అండగా ఉంటామని తెలిపారు.

# చేనేత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

- మండల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్
- ప్రత్యేక సంక్షేమ పథకాలు అమలు చేయాలని చేనేత సంఘం డిమాండ్
- చేనేత కార్మికులకు జీవన భృతి కల్పించాలి
- నూలు, మగ్గాలపై సబ్సిడీలు పెంచాలి
- చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటుధర ఇవ్వాలి
- ఆరోగ్య బీమా, పెన్షన్, విద్యా సహాయం అందించాలి







**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, ఆగస్టు 29:** చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న కార్మికుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించి, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని చేనేత సంఘం కోరింది. పెరుగుతున్న నూలు, రంగులు, ఇతర ముడిసరుకుల ధరలతో పాటు తయారీ ఖర్చులు అధికమవుతుండగా, చేనేత వస్త్రాలకు మార్కెట్‌లో ఆశించిన ధర లభించకపోవడంతో కార్మికులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తిరుమలాయపాలెం మండల చేనేత సహకార సంఘం అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్ తెలిపారు. చేనేత కార్మికులకు నూలు, రంగులు, మగ్గాలు, ఇతర పరికరాలపై సబ్సిడీ అందించాలని, పాత మగ్గాల స్థానంలో ఆధునిక మగ్గాలు ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక సహాయం కల్పించాలని ఆయన కోరారు. అలాగే చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించి, మధ్యవర్తుల ప్రమేయం తగ్గించి కార్మికులకు నేరుగా మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ శాఖలు, పాఠశాలలు, సంక్షేమ సంస్థలకు అవసరమైన వస్త్రాలను చేనేత సంఘాల నుంచి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటే కార్మికులకు నిరంతరం ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.

> » చేనేత కుటుంబాలకు ఆర్థిక, సామాజిక భరోసా కల్పించాలి....

చేనేత కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలు చేసి అండగా నిలవాలని సంఘం కోరింది. అర్హులైన చేనేత కార్మికులకు నెలవారీ ఆర్థిక భృతి, వృద్ధాప్య పెన్షన్, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా సౌకర్యాలను కల్పించాలని, అనారోగ్యంతో బాధపడుతున్న చేనేత కార్మికులకు ఉచిత వైద్య సదుపాయాలు అందించాలని విజ్ఞప్తి చేసింది. చేనేత కుటుంబాల్లోని పిల్లలకు విద్యా సహాయం, ఉపకార వేతనాలు, ఉన్నత విద్యకు ఆర్థిక ప్రోత్సాహం అందించాలని కోరారు. మగ్గాల ఏర్పాటు, ముడి సరుకుల కొనుగోలు కోసం తక్కువ వడ్డీతో రుణాలు మంజూరు చేయడంతో పాటు చేనేత సహకార సంఘాలను బలోపేతం చేయాలని తెలిపారు. చేనేత వస్త్రాలకు విస్తృత మార్కెట్ కల్పించేందుకు ప్రత్యేక విక్రయ కేంద్రాలు, ప్రదర్శనలు, ఆధునిక మార్కెటింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. చేనేత రంగం తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తున్నందున ఈ వృత్తిని భావితరాలకు అందించేందుకు యువతకు శిక్షణ, ఉపాధి, ఆర్థిక ప్రోత్సాహకాలు కల్పించాలని మండల చేనేత సంఘం సంఘం నాయకులు కోరారు. చేనేత కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి, సమగ్ర చేనేత సంక్షేమ పథకాన్ని అమలు చేసి ప్రతి చేనేత కుటుంబానికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

# కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో రెండు బైక్ లు ఢీ

- ఇద్దరికి తీవ్ర గాయాలు



**వేంసూర్ ఆగస్టు 29 ప్రజాజ్యోతి** వేంసూర్ మండల పరిధిలోని కల్లూరుగూడెం పామాయిల్ ఫ్యాక్టరీ సమీపంలో శనివారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. మర్లపాడు నుండి గూడూరు వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి వచ్చిన మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదంలో బీరాపల్లికి చెందిన సత్యనారాయణ రెడ్డి (64), గూడూరుకు చెందిన కిరణ్ (44) తీవ్రంగా గాయపడ్డారు.సమాచారం అందుకున్న వేంసూర్ 108 సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# మధిర ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఘనంగా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు



**మధిర ప్రజా జ్యోతి** తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మధిరలో తెలుగు విభాగం ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి సభాధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం, తెలుగు సాహిత్య ప్రాధాన్యత, తెలుగు భాష పరిరక్షణ మరియు అభివృద్ధిలో విద్యార్థుల పాత్ర గురించి ప్రసంగించారు. విద్యార్థులు తెలుగు భాష పట్ల అభిమానం పెంపొందించుకొని, దైనందిన జీవితంలో తెలుగును విస్తృతంగా వినియోగించాలని సూచించారు.తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రథమ సెమిస్టర్ విద్యార్థులకు తెలుగు సబ్జెక్టుకు సంబంధించిన అధ్యయన సామగ్రిని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రవీంద్రారెడ్డి ఉచితంగా పంపిణీ చేశారు. విద్యార్థులు తెలుగు భాష, సాహిత్యంపై మరింత ఆసక్తి పెంపొందించుకోవడానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.అరుణ,అధ్యాపకులు డా. ఎస్. ఇందిర, డాక్టర్ పి. సుజాత, పి. లక్ష్మీనారాయణ, పి. శ్రీనివాస్, డాక్టర్ వి. నాగరాజు, డాక్టర్ ఎం.వి. శర్మ, ఎం.వి.ఎస్. శర్మ, ఎస్. జ్యోతి, ఎస్. పృథ్వీరాజ్, షేక్ ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# ధరల మంటల్లో సామాన్యుడు

- బీజేపీ పాలనలో ప్రజలపై పెరుగుతున్న భారాలు
- నిత్యావసర ధరలు అదుపు చేయాలి..యువజన కాంగ్రెస్ నాయకుడు ఏనుగంటి క్రిష్ణ



**తిరుమలాయపాలెం, ప్రజా జ్యోతి, ఆగష్టు 29:**దేశంలో నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ పెరుగుతూ సామాన్య ప్రజల జీవనాన్ని దుర్భరంగా మారుస్తున్నాయని యువజన కాంగ్రెస్ నాయకుడు ఏనుగంటి క్రిష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పప్పులు, వంట నూనెలు, కూరగాయలు, చక్కెరతో పాటు అనేక నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో ప్రతి కుటుంబంపై అదనపు ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెరిగిన ఖర్చులతో కుటుంబాలను నెట్టుకొస్తున్న సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ధరల పెరుగుదల మరింత ఇబ్బందులను తెచ్చిపెడుతోందని అన్నారు. ప్రజలకు అచ్చే దిన్ తెస్తామని హామీ ఇచ్చిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో విఫలమైందని విమర్శించారు. ధరల పెరుగుదలతో ప్రజల ఆదాయానికి, కుటుంబ ఖర్చులకు మధ్య వ్యత్యాసం పెరుగుతోందని పేర్కొన్నారు.ప్రజల కష్టాలను పట్టించుకోకుండా ధరల నియంత్రణలో విఫలమైన బీజేపీ ప్రభుత్వ విధానాలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని ఏనుగంటి క్రిష్ణ తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలను తక్షణమే అదుపులోకి తీసుకురావడంతో పాటు సామాన్య ప్రజలపై పడుతున్న ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ధరల పెరుగుదల వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు. ప్రజల సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని, సామాన్య ప్రజల గొంతుకగా నిలిచి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఏనుగంటి క్రిష్ణ స్పష్టం చేశారు.

# పెండింగ్ వేతనాలపై సమ్మె బాట



**కల్లూరు, ఆగస్టు 29:** ప్రజా జ్యోతి కల్లూరు మున్సిపాలిటీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబర్ 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళుతున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేము రాంబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం మున్సిపల్ కమిషనర్ జి. సాయి కృష్ణారెడ్డి కి సమ్మె నోటిసు అందజేశారు. కల్లూరు మున్సిపాలిటీ ఏర్పడిన 15 నెలల్లో కేవలం ఆరు నెలల వేతనాలు మాత్రమే చెల్లించారని మరో 9 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని రాంబాబు పేర్కొన్నారు. మే 25న చైర్మన్, కమిషనర్, కౌన్సిలర్లు పూర్తి వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో గతంలో సమ్మె విరమించామని అయినా ఇప్పటివరకు బకాయిలు చెల్లించలేదన్నారు. స్థానిక మంత్రికి నాలుగు సార్లు వినతి పత్రాలు ఇచ్చిన స్పందన లేదని తెలిపారు. సెప్టెంబర్ 15 లోగా పెండింగ్ వేతనాలు చెల్లించకపోతే 16 నుంచి విధులు పూర్తిగా బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. అప్పటివరకు రోజు వారి నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి వజర్మియా సోషల్ మీడియా అధ్యక్షుడు మణి రాజు అనిల్ చింతపల్లి శీను బాబు గౌడ్, ప్రకాష్, రవి, మల్లికార్జున్, పాగా శ్రీను, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పంటల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

నమోదయ్యాయో లేదో పరిశీలించుకోవాలని సూచించారు. వాలంటీర్లు త్వరితగతిన రైతుల పంట వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఎప్పటికప్పుడు వాలంటీర్లతో మాట్లాడి, వారికి ఎదురవుతున్న సందేహాలను నివృత్తి చేస్తూ సర్వేను త్వరగా పూర్తి చేయించాలని సూచించారు.అనంతరం అపరాలలో మిషన్ ఫర్ ఆత్మనిర్భరత పథకం ద్వారా రాయితీపై పెసర విత్తనాలను రైతులకు అందించారు. అనంతరం పెసర మరియు ప్రత్తి పంటను పరిశీలించి రసం పీల్చు నివారణ చర్యలు చేపట్టాలని రైతులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ సరిత, కూసుమంచి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు రాజేష్,రైతు శిక్షణ కేంద్రం వ్యవసాయ అధికారి అరుణ జ్యోతి, మండల వ్యవసాయ అధికారి రామడుగు వాణి వ్యవసాయ విస్తరణ అధికారులు రవీందర్ , రవి , ఉపేందర్ , ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

